క్లుప్తంగా

పుత్తూరు తహసీల్దార్‌గా రోశయ్య


రోశయ్య

పుత్తూరు రూరల్: పుత్తూరు తహసీల్దార్‌గా రోశయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వడమాలపేట నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ మూడు నెలలుగా డీటీ రవికుమార్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించారు.

మున్సిపల్ వార్డు కన్వీనర్ల అధ్యక్షుడిగా దయానిధి


దయానిధిని సత్కరిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి : మున్సిపల్ పరిధిలోని వార్డు సచివాలయ కన్వీనర్లకు అధ్యక్షునిగా 5వ వార్డు కౌన్సిలర్ దయానిధి నియమితులయ్యారు. గురువారం స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన వార్డు కన్వీనర్ల సమావేశంలో దయానిధిని వార్డు కన్వీనర్ల అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఆయన్ను వైఎస్సార్ సీపీ నాయకుడు రామ్‌ప్రసాద్ రెడ్డి సత్కరించారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, పార్టీ ఉన్నతికి కృషి చేస్తానని దయానిధి తెలిపారు.

పెరుమాళ్లపల్లె డీడీఓగా ధనలక్ష్మి


డీడీఓను సత్కరిస్తున్న నాయకులు

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లె సచివాలయం డీడీఓగా ధనలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. బ్రాహ్మణపల్లె డీడీఓగా ఉన్న ఆమెను పెరుమాళ్లపల్లెకు బదిలీ చేశారు. సర్పంచ్ శశికుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు షణ్ముగరెడ్డి, పరంధామరెడ్డి, మాజీ సర్పంచ్ హనుమంత రెడ్డి డీడీఓను ఘనంగా సత్కరించారు.

సంఘ సంస్కర్త వేమన


విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం

వెదురుకుప్పం: వేమన సంఘసంస్కర్త అని, సమాజసేవలో తరించినట్లు స్థానిక జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ప్రజాకవి వేమన జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వేమన శతకంలోని ఆటవెలది పద్యాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బండి ప్రభాకరరెడ్డి, ఉమామహేశ్వర్, శ్రీనివాసులు, మురళీరెడ్డి, భద్రావతి, విజయలక్ష్మి, సీఆర్పీ అంకయ్య, విద్యాకమిటీ చైర్మన్ మునికృష్ణయ్య పాల్గొన్నారు.

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజాకవి, తాత్వికవేత్త వేమన సేవలు మరువలేనివని కలెక్టర్ హరి నారాయణన్ అన్నారు. యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ యోగి వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కలెక్టర్ మాట్లాడుతూ పామరులకు కూడా అర్థమయేలా వేమన పద్యాలు చెప్పి మెప్పించిన కవి అని అన్నారు. విశ్వదాభిరామ వినుర వేమ అనే మాట వినని తెలుగు వారుండరని తెలిపారు. బ్రిటీష్ అధికారి సీపీ బ్రౌన్‌తోనే వేమన పద్యాలు వెలుగులోకి వచ్చాయన్నారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఆటవెలదిలో అద్భుతమైన కవిత్వం, అనంత విలువలు గల సలహాలు, సూచనలు, తెలుగు సంగతులు ఇమిడ్చిన మహానుభావుడు వేమన అని అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో రాజశేఖర్, ఏఓ కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేతో అర్హులను గుర్తించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకరరావు

వెదురుకుప్పం: ఇంటి సర్వే చేసి, పథకాలకు అర్హులను గుర్తించాలని ఎంపీడీఓ సుధాకరరావు అన్నారు. గురువారం వెదురుకుప్పంలో డీడీఓలు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌస్‌హోల్డ్ సర్వే మ్యాపింగ్‌కు అవకాశం ఉన్నందును ప్రతి ఒక్కరూ పకడ్బందీగా సర్వే చేపట్టాలన్నారు. భూమి, నాలుగు చక్రాల వాహనాలు ఉండడంతో కొందరు పింఛన్లకు దూరమయ్యారని, అలాంటి వారిని గుర్తించాలన్నారు. ఆధార్ అప్‌డేట్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈఓపీఆర్డీ పురుషోత్తం పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

–డిప్యూటీ సీఎం నారాయణస్వామి


లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తూ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం మండలంలోని చింతపెంట సచివాలయ పరిధిలోని చింతపెంట, కత్తిరెడ్డిపల్లె, మాణిక్యరాయనిపల్లె, ఎగువ గాగమ్మగారిపల్లె, రామలింగాపురం, రాఘవరెడ్డిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారు విజయమ్మ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వ పథకాలు అందేవి కావని, గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో తమలాంటి అమాయకులను ఇబ్బందులకు గురి చేసేవారన్నారు. నేడు వలంటీర్ల ద్వారా అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ పథకాలు ఇంటి గుమ్మం వద్దకే వస్తున్నాయని చెప్పారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని, దేశంలోని ఇతర రాష్ట్రాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. నూతన వివాహం అయిన వారికి ఈ నెల 24వ తేదీలోపు మార్పులు చేసుకుని, రేషన్‌కార్డులు పొందాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అడ్డుకోవడానికి చంద్రబాబు, ఎల్లో మీడియా, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారని, దొంగల ముఠాను ప్రజలు నమ్మబోరని విమర్శించారు. అనంతరం గ్రామస్తులు తమ గ్రామాల్లో సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి మాట్లాడుతూ మాణిక్యరాయనిపల్లెకు రూ.13 లక్షలతో డ్రైనేజ్, రామలింగాపురం గ్రామానికి రూ.6 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి, కత్తిరెడ్డిపల్లె రూ.17 లక్షలతో డిజిటల్ గ్రంథాలయం నిర్మాణానికి, అలాగే రూ.35 లక్షలతో నూతన కమ్యూనిటీ భవన నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు(ఎంపీటీసీ సభ్యులు) యశోదారెడ్డి, జిల్లా యువత ప్రధాన కార్యదర్శి విజయకుమార్‌రెడ్డి, సర్పంచ్ అమరావతి, ఎంపీటీసీ సభ్యుడు సుబ్రమణ్యంరెడ్డి, జమున, నాయకులు దూదిమోహన్, సుధాకర్, కృష్ణారెడ్డి, రాజారెడ్డి, మురళి, విజయశేఖర్‌రెడ్డి, రాజేంద్రరెడ్డి, మోహన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, ఎంపీడీఓ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలు బడిలోకి వచ్చేలా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ


మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ రాజేంద్రన్

నగరి : బడిబయట పిల్లలు బడిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ శ్రీదేవి ఆదేశించారు. గురువారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ఆమె సమావేశమయ్యారు. ఎంఈఓ మాట్లాడుతూ, జగనన్న గోరుముద్ద పిల్లలకు మరింత రుచికరంగా పెట్టాలని, సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్ జవాబు పత్రాల మూల్యాంకనం ఎలాంటి తప్పులు, దిద్దుబాట్లు లేకుండా పూర్తి చేసి మార్కులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. దీక్షా యాప్‌లో అందరూ నమోదై ఆ యాప్‌లో పొందుపరిచిన వీడియోలను పిల్లలకు చూపించాలన్నారు. నాడు–నేడు పాఠశాలల్లో పనులన్నీ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుని రికార్డులు, రిజిస్టర్లను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

మెరుగైన విద్యనందించండి

గంగాధరనెల్లూరు: విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఎంఈఓ రాజేంద్రన్ కోరారు. మండలంలోని ఒడ్డుపల్లె, అప్పిరెడ్డికండ్రిగ, రామానాయుడుపల్లె ప్రాథమిక పాఠశాలల్ని గురువారం ఏపీఎం చిరంజీవితో కలసి ఆయన తనిఖీ చేశారు. రికార్డుల్ని పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, రుచి చూశారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. సమ్మేటివ్ పరీక్ష పత్రాలను దిద్ది ఆన్‌లైన్ చేయాలన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు


అన్నూరులో నువ్వుల పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కార్వేటినగరం: పంట సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ ఉప సంచాలకులు గోపాల్ అన్నారు. గురువారం మండలంలోని అన్నూరు, ఆర్కేవీబీపేట గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి, వేరుశనగ, మిరప, రాగి, చెరుకు, నువ్వులు తదితర పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మిరప సాగు చేసిన తరువాత ప్రతి 15 రోజులకొకసారి వేప నూనె పిచికారీ చేస్తే మిరప పంటకు ముడత రోగం సోకదని చెప్పారు. తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే ఆకుపై ముడత నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.2 మిల్లీలీటర్ ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలని, ఆకు కింద ముడత నివారణకు టోకన్ మందు 0.5 గ్రాములు, వేప నూనె 2 మిల్లీ, ఒక లీటర్ నీటితో కలిపి పిచికారీ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నాగపద్మిని, వ్యవసాయ అధికారులు లక్ష్మీప్రసన్న, హేమలత, ఏఈఓలు గాయత్రి, హేమాద్రి పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ ఇవ్వాలని ధర్నా


పుత్తూరులో ధర్నా చేస్తున్న పవర్‌లూమ్ వర్కర్లు

పుత్తూరు రూరల్: పనులు లేక ఆర్థికంగా చితికిపోయిన పవర్‌లూమ్స్ వర్కర్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెరుమాళ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఏపీఎస్పీ డీసీఎల్ ఈఈ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ఏపీ ఈఆర్‌సీ సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో పవర్‌లూమ్స్ వర్కర్ల వినతి పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పొరుగు రాష్ట్రం తమిళనాడులో 750 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా ఇస్తున్నారని, మన రాష్ట్రంలో కనీసం 500 యూనిట్లైనా ఉచితంగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 వేల కుటుంబాలు పవర్‌లూమ్స్‌పై ఆధారపడి జీవిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, నాయకులు సుబ్రమణ్యంపిళ్లై, షణ్ముగం, జగదీశ్, ఆర్ముగం, నాగప్ప, వర్కర్లు పాల్గొన్నారు.

ఎంపీడీఓ చొరవతో నీటి సమస్య పరిష్కారం

గంగాధరనెల్లూరు: స్థానిక ఎంపీడీఓ శ్రీదేవి చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. వివరాల్లోకి వెళితే మహదేవమంగళం గ్రామంలో తాగునీటి బోరు పాడైపోయింది. గురువారం బోరు మరమ్మతుల కోసం పైపులు వెలికి తీసే వాహనాన్ని రప్పించారు. పక్కన ఉన్న భూమి నుంచి వాహనం వెళ్లడానికి యజమాని అంగీకరించకపోగా, వాహనాలను అడ్డుపెట్టి వెళ్లకుండా చేశారు. సమాచారం అందుకున్న ఎంపీడీఓ ఆ గ్రామానికి వెళ్లి, భూమి యజమానితో మాట్లాడి, వాహనం చేతి బోరు వద్దకు వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

కాలనీలకు విద్యుత్ పరికరాలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని జగనన్న కాలనీలకు విద్యుత్ పరికరాలు వచ్చాయని ట్రాన్స్‌కో నిర్మాణ విభాగం ఈఈ రమణ తెలిపారు. 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 10, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 10, 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 8 వచ్చాయన్నారు. అలాగే లబ్ధిదారులకు అందించే ఉచిత విద్యుత్ మీటర్లు 4 వేలు, కేబుల్ వైర్లు 60 వేల మీటర్లు జిల్లా స్టోర్‌కు చేరాయన్నారు. ఏఈలు వర్క్ ఆర్డర్లు పెట్టి పరికరాలు తీసుకోవాలని చెప్పారు.

ఉభయకర్తలు సహకరించాలి

తవణంపల్లె: కాళభైరేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఉభయకర్తలు సహకరించాలని ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి కోరారు. గురువారం సాయంత్రం కాళభైరేశ్వర ఆలయంలో ఉభయకర్తల కమిటీ సమావేశం నిర్వహించారు.

గ్రామాల్లో పనులు వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : నేచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ పథకం ద్వారా ఎంపిక చేసిన గ్రామాల్లో పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. గురువారం జిల్లాలో డ్వామాశాఖ ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాల పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్ఎంఎంఎస్ పథకంలో చేపడుతున్న పనులను వేగవంతం చేసి మరింత ఎక్కువమందికి ఉపాధి కల్పించాలన్నారు. గృహ నిర్మాణ పథకంలో మరింత ఎక్కువ మందికి పని కల్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీలు పనిచేసే వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ రోజువారీ వేతనం రూ.246 తగ్గకుండా చూడాలని తెలిపారు. అమృత్ సరోవర్ ప్రాజెక్టు కింద జిల్లాకు 70 ప్రాజెక్టులు మంజూరు అయ్యాయని చెప్పారు. ఇప్పటివరకు 31 ప్రాజెక్టులు పూర్తి అయ్యాయని తెలిపారు. మిగిలినవి వెంటనే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని, ఏపీడీలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, వరప్రసాద్, వెంకటరత్నం, శోభన్ బాబు, ప్రియదర్శిని, జయచంద్ర, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యవంతమైన శిశు జననానికి, వారు తీసుకోవాల్సిన పోషకాహారం, జాగ్రత్తలపై అంగన్‌వాడీ కార్యకర్తలు మరింత శ్రద్ధ చూపాలన్నారు. సీడీపీఓలు వారి విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో ఎత్తు, బరువు తక్కువ ఉన్న పిల్లల ఆరోగ్య పరిస్థితులకు సంబంధించి చిన్నపిల్లల వైద్యనిపుణుల సూచనలతో వారి ఆరోగ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టాలన్నారు. వైద్యుల సూచనలు మేరకు ప్రతి నెలా పిల్లలు బరువు పెరిగేలా వారికి అవసరమైన పోషకాహారం అదనంగా అందించేందుకు కృషి చేయాలన్నారు. సీడీపీఓలు వారి పరిధిలో బరువు తక్కువ ఉన్న పిల్లలను, రక్తహీనత ఉన్న గర్భిణుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. వారికి అవసరమైన వైద్య సలహాలు ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్త సాయంతో అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలను నిర్మూలనకు సచివాలయ స్థాయిలో మహిళా పోలీస్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలతో ఆడపిల్లల్లో తలెత్తే ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచాలని కలెక్టర్ సూచించారు.

ఖోఖో క్రీడాకారులకు జేసీ అభినందన


ఖోఖో క్రీడాకారులను అభినందిస్తున్న జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ తరఫున జాతీయ ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొననున్న ఖోఖో క్రీడాకారులను జేసీ వెంకటేశ్వర్ అభినందించారు. గురువారం స్థానిక మెసానికల్ మైదానంలో శిక్షణ పొందుతున్న ఖోఖో క్రీడాకారులను జేసీ పలకరించారు. జేసీ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని చెప్పారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలన్నారు. చీఫ్ కోచ్ బాలాజీ మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ లో జరిగే పోటీల్లో రాష్ట్ర ఖోఖో జట్టు పాల్గొంటుందన్నారు. ఖేలో ఇండియాలో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏపీ తరఫున పాల్గొంటున్న క్రీడాకారులు చిత్తూరులో శిక్షణ పొందుతున్నారన్నారు. వారికి కోచ్‌గా కాకినాడకు చెందిన పాపారావు వ్యవహరిస్తున్నారని తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

ఐరాల: సారా తయారు చేసి, అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. మండలంలోని మొరంపల్లె పంచాయతీలోని కోమిటిగురవయ్యగారిపల్లెకు చెందిన హేమచంద్రబాబు తన ఇంటి వద్ద సారా తయారు చేసి, చుట్టుపక్కల ప్రజలకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన ఎస్‌ఐ తన సిబ్బందితో కలసి ఆ ప్రాంతంలో దాడులు చేశారు. అతని నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు


చవటగుంటలో విద్యార్థుల మానవహారం

నగరి : యువత మాదక ద్రవ్యాలకు బానిస కారాదని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. గురువారం కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలు సంయుక్తంగా 'మాద క ద్రవ్యాలు లేని ఆంధ్రప్రదేశ్ వైపు అడుగులు' కార్యక్రమం నిర్వహించాయి. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, సహవాసాలతో భవిష్యతును నాశనం చేసుకోరాదన్నారు. చెడు వినకు–చెడు మాట్లాడకు–చెడు చూడకు అనేది గాంధీజీ నినాదంతో ముందుకు పోవాలన్నారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలైన గంజాయి, మద్యం, హెరాయిన్, కొకైన్ వంటి వాటికి దూరంగా ఉండాలని, ఎవరైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ గోపి, డాక్టర్ భాస్కర్ మాట్లాడారు.మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని నాశనం చేస్తుందని, అవమానాలకు గురవుతారన్నారు. మాదకద్రవ్యాల వినియోగం విలాసాలతో మొదలై విషాదంతో ముగుస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ధర్మారావు, శివయ్య, గురుమూర్తి, కిరణ్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి

వెదురుకుప్పం: డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. గురువారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'యువత మేలుకో–భవితను మలుచుకో' అన్న అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత డ్రగ్స్, మత్తు పదార్థాలు, మద్యం, ధూమపానం తదితర దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల వాడకంతో జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని చెప్పారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి బంగారు భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం మానవహారం నిర్వహించి, డ్రగ్స్ అలవాట్లకు దూరంగా ఉంటామని విద్యార్థులు ప్రమాణం చేశారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి మంగళగౌరి, వైఆర్సీ కో–ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు


మాట్లాడుతున్న కిరణ్‌దేవ్

పాలసముద్రం : మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చూడాలని (ఎన్ఐఆర్‌డీ) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ రీ సెర్చ్ అధికారి కిరణ్‌దేవ్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విద్యావతి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కిరణ్‌దేవ్ మాట్లాడుతూ పింఛన్ తీసుకోవడానికి అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేయడానికి సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన పాలసముద్రం సచివాలయ పరిధిలోని గ్రామాలకు వెళ్లి, పింఛన్ మంజూరు చేయడానికి ఎవరైనా మధ్యవర్తులను ఆశ్రయిస్తున్నారా? పింఛన్ సక్రమంగా అందుతుందా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. పింఛన్ పంపిణీలో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డేటా కలెక్షన్ అసిస్టెంట్ హరి, జగదీష్ మండల విస్తరణాధికారి రమేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్


రోగుల్ని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రశాంత్

గంగాధరనెల్లూరు: పౌష్టికాహారంతో రక్తహీనతను నివారించవచ్చని తూగుండ్రం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. మండలంలోని వేపంజేరిలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. హిమోగ్లోబిన్ 13 గ్రాముల నుంచి 16 గ్రాముల వరకు ఉండాలన్నారు. అందకన్నా తక్కువ ఉంటే రక్తహీనత ఉన్నట్లు గుర్తించాలన్నారు. రక్తహీనత లోపిస్తే వ్యాధినిరోధక శక్తి తగ్గిపోతుందన్నారు. తద్వారా పలు వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. అనంతరం ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి రాజేంద్రప్రసాద్, సూపర్‌వైజర్ కృష్ణమ్మ, సీహెచ్ఓ గౌతమి పాల్గొన్నారు.

పక్కాగృహాల నిర్మాణం వేగవంతం చేయండి


ముదికుప్పంలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఏఈ శ్రీధర్

శ్రీరంగరాజపురం: ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన పక్కాగృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ శ్రీధర్ అన్నారు. మండలంలోని ముదికుప్పం పంచాయతీలో నిర్మిస్తున్న జగనన్న కాలనీని గురువారం సందర్శించారు. ఏఈ మాట్లాడుతూ పక్కాగృహాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని చెప్పారు. వలంటీర్లు లబ్ధిదారులకు అవగాహన కల్పించి ప్రభుత్వం నిర్వహించబోయే సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసుతులు కల్పించామని తెలిపారు. ఆర్థికంగా వెనుకపడిన లబ్ధిదారులకు కూడా ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీ కింద రూ.50 వేలు రుణం మంజూరు చేస్తుందని, ఈ విషయాన్ని లబ్ధిదారులు వివరించాలన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మాధవ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కుమార్ పాల్గొన్నారు.

ఎల్‌ఐసీని ప్రైవేటీకరించొద్దు

- జీవిత బీమా సంస్థ ఉద్యోగుల ఆందోళన


పుత్తూరు ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు

పుత్తూరు రూరల్: జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ) ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని ఏఐఐసీఏ యూనియన్ పుత్తూరు బ్రాంచి కార్యదర్శి ఎన్.లక్ష్మణ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం జీవిత బీమా జాతీయకరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భోజన విరామ సమయంలో కార్యాలయ ఆవరణలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఎల్‌ఐసీని ప్రైవేటీకరించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎల్‌ఐసీ ఉద్యోగుల పెన్షన్‌లో మెరుగుదల కల్పించాలని, ఎన్‌పీఎస్‌ను రద్దు చేయాలని, బీమా ప్రీమియంపై జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు దస్తగిరి, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కోశాధికారి షణ్ముగం, నాయకులు గణేష్‌బాబు, మోహన్‌రెడ్డి, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

దుకాణాలు.. హోటళ్లపై దాడులు


కొంగారెడ్డిపల్లెలోని హోటళ్లను తనిఖీ చేస్తున్న కమిషనర్ జె అరుణ

చిత్తూరుఅర్బన్: నగరంలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, చికెన్ సెంటర్లపై నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు గురువారం రాత్రి దాడులు చేశారు. నగరంలో హోటళ్లపై ఇటీవల ఫిర్యాదుల రావడంతో గురువారం రాత్రి కొంగారెడ్డిపల్లె పరిధిలోని పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చికెన్ సెంటర్లపై మున్సిపల్ కమిషనర్ అరుణ ఆధ్వర్యంలో ఎంహెచ్ఓ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకస్మిక దాడులు చేశారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పనిచేసే సిబ్బంది వ్యక్తిగత శుభ్రత పాటించాలని హెచ్చరించారు. మాంసం, తమ ఇతర ఆహార ఉత్పత్తులను ఫ్రిజ్‌ల్లో ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఫుడ్ కలర్స్, ఇతర హానికర పదార్థాలు నిబంధనలు అతిక్రమించి, వినియోగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను మూయిస్తామని హెచ్చరించారు. కొన్నింటికి నోటీసులు జారీ చేశారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వినియోగించకూడదన్నారు.శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ పాల్గొన్నారు.